

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

సదర్ సమ్మేళనానికి హాజరు కండి

● గవర్నర్‌కు ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ ఆహ్వానం

రాంనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను పురస్కరించుకొని శ్రీకృష్ణ సదర్ సమ్మేళన కమిటీ 2025 ఆధ్వర్యంలో ఈనెల 19న ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించే దీపావళి సమ్మేళనానికి హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ శుక్రవారం రాజ్‌భవన్‌లో ఆయనను కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ ప్రతినిధులు శంకర్‌యాదవ్, గౌరి సతీష్ పాల్గొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేయాలి

చిక్కడపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చే యాలని కోరుతూ శుక్రవారం ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా. జి. చిన్నారెడ్డిని కలిసి నిరుద్యోగులు వినతిపత్రం సమర్పించారు. చిక్కడపల్లి సిటిసెంట్రల్ లైబ్రరీ నిరుద్యోగ జేఏసీ నేతలు కయ్య వెంకటేష్, శంకర్‌నాయక్, బాలకోటి, సంపత్, రాజేష్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ, పోలీస్‌కానిస్టేబుల్, గ్రూప్స్, పవర్‌సెక్టార్ రంగంలో నోటిఫికేషన్స్ విడుదల చేయాలని చిన్నారెడ్డిని కోరినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీఎంతో మాట్లాడి నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగులపై కాంగ్రెస్ పార్టీకి లేకుండా పోయిందన్నారు.



ఘంటసాల పాటలు ఆలపిస్తున్న చంద్రతేజ తదితరులు

ఆకట్టుకున్న ఘంటసాల గానవిభావరి

చిక్కడపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రతేజాలయ మ్యూజిక్ అకాడమీ, సృష్టి ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘంటసాల గానామృతం శీర్షికతో త్యాగరాయగానసభలో నిర్వహించిన ఘంటసాల సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయనీగాయకులు చంద్రతేజ, వీకే దుర్గల ఆధ్వర్యంలో ఎంపిక చేసుకున్న వివిధ చిత్రాల గీతాలను మధురంగా ఆలపించారు. శివప్రసాద్, శివలీల, సూర్యతేజ, మోహన్, శివరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ -2 పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీ ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. బాలాజినగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11గంటల వరకు, శివం, హర్రాజ్ పెంట, పార్శిగుట్ట, దిల్‌కుష పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1, అవంతినగర్ పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2, బౌద్ధనగర్, శివాలయం, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, లేక్ ప్లాజా, జె. మార్కెట్ పరిధిలో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే యువతీ యువకులకు శుక్రవారం పోలీసులు ఘంటసాల గ్రౌండ్‌లో కమ్యూనిటీ పోలీసింగ్‌పై ఎస్‌ఐ నరసింహ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువతకు ఏదైనా ఆపద వస్తే వెంటనే 100కు డయల్ చేయాలని, సైబర్ క్రైంను అరికట్టేందుకు 1930లకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. - కవాడిగూడ, ఆంధ్రజ్యోతి

కాచిగూడ రైల్వేస్టేషన్ నూతన డైరెక్టర్‌గా నాగేశ్వరరావు నియామకం



బర్కత్‌పుర, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : కాచిగూడ రైల్వేస్టేషన్ నూతన డైరెక్టర్‌గా నాగేశ్వరరావు నియమితులయ్యారు. శుక్రవారం ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం డైరెక్టర్‌గా ఉన్న బాలాజీ బదిలీ కావడంతో విజయవాడ నుంచి బదిలీపై నాగేశ్వరరావు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాచిగూడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రయాణికులకు పటిష్టమైన సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కవాడిగూడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ ఎస్‌ఐ నరసింహ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న పిల్లర్ నెంబర్ 1028 బోలక్‌పూర్ కృష్ణానగర్ వద్ద 45 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది పడి ఉన్నాడని సమాచారం అందుకొన్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గాని లేదా ఫోన్ నెంబర్ 8712660145లో సమాచారం అందించాలని ఆయన కోరారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు



విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రాంనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అడిక్‌మెట్ డివిజన్‌లోని పోచమ్మబస్తీ, నల్లకుంట పీఎస్ వీధిలో ఉన్న వీధి దీపాల సమస్యను బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన విద్యుత్ దీపాలను వేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిషోర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ, ప్రభాకర్, రాకేష్



మాట్లాడుతున్న గంగం రవి, రెబ్బ రామారావు, కుడిది రాజు



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద మాట్లాడుతున్న పద్మశాలీ ప్రజాసంఘం నేతలు

నేటి బంద్‌ను సబ్బండ వర్గాలు జయప్రదం చేయాలి

ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్

చిక్కడపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం జరిగే రాష్ట్ర బంద్‌కు సబ్బండవర్గాల ప్రజలు మద్దతు పలికి జయప్రదం చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విజ్ఞప్తి చేశారు. వ్యాపార, వాణిజ్యవర్గాలు, థియేటర్లు, పెట్రోల్‌బంక్‌లు, హోటళ్లు తదితరులందరూ బంద్‌కు మద్దతుగా తమ సంస్థలను మూసివేసి బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపాలని ఆయన కోరారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా దేశ జనాభాలో సగం కంటే ఎక్కువగా బీసీ ప్రజలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీలకు జనాభా ప్రాతిపదికన 42శాతం రిజర్వేషన్లు లభించాల్సిందేనన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారని అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో చిత్తశుద్ధి చూపడంలేదని ధ్వజమెత్తారు. అన్ని పక్షాలను కలుపుకుని ఢిల్లీకి తీసుకుపోతామని చెప్పి కాంగ్రెస్ పార్టీ వారు ఒక్కరే ఢిల్లీకి పోయి తూతూమంత్రంగా జంతర్‌మంతర్ వద్ద ధర్నా జరిపారన్నారు. ఒకసారి ఆర్డినెన్స్ అని మరోసారి బీసీ బిల్లు అని హైకోర్టు, సుప్రీంకోర్టు అంటూ కాలయాపన చేయడం త ప్పా బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి కనబరచడం లేదన్నారు. శనివారం ఉద యం తెలంగాణ భవన్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు బంద్‌ను పర్యవేక్షిస్తారని, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉద యం 9గంటలకు ఆర్టీసీ క్రాస్‌రోడ్డు చేరుకుని బంద్‌ను పరిశీలిస్తారన్నారు.

జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి పక్షాన విస్తృత ప్రచారం

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్ ఇన్‌చార్జీగా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్ విజయం కోసం పెద్దఎత్తున ప్రచా రం చేస్తున్నామన్నారు. మాగంటి గోపీనాథ్ ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని ముఖ్యంగా మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా చేస్తున్న తమ ఎన్నికల ప్రచారానికి పెద్దఎత్తున స్పందన లభిస్తోందని ముఠా గోపాల్ వివరించారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత ముఠా జైసింహ, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు మున్నూరుకాపు సంఘం సంపూర్ణ మద్దతు

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేకు నిరసనగా శనివారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర బంద్‌కు ముషీరాబాద్ మున్నూరుకాపు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈసందర్భంగా శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో విలేకరుల సమావేశంలో సంఘం కన్వీనర్ గం గం రవి, అధ్యక్షుడు రెబ్బ రామారావు, ఉపాధ్యక్షుడు కుడిది రాజులు మాట్లాడారు. ముషీరాబా ద్ నియోజకవర్గంలోని మున్నూరుకాపు సోదరులు వెనుకబడిన తరగతు ల ప్రజలు ఈ బంద్‌కు మద్దతు తెలిపి విజయవంతం చేసి బీసీల ఐక్యత చాటాలని విజ్ఞప్తి చేశారు. నగరంలోని ప్రజలు గాంధేయమార్గంలో శాంతియుతంగా బంద్ పర్‌జస్టిఎను జయప్రదం చేయాలని కోరారు.



బంద్ జయప్రదం చేయాలని విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, రాజునేత, రాజ్‌కుమార్, మణికంఠ తదితరులు

ముషీరాబాద్ పద్మశాలీ ప్రజాసంఘం..

బీసీ జేఏసీ పిలుపు మేరకు తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ముషీరాబాద్ పద్మశాలీ ప్రజాసంఘం అధ్యక్షుడు తలకొక్కుల సంజీవ్‌కుమార్, జేఏసీ నేతలు రోషం బాలు, పున్న సత్యనారాయణ, కుమార్, మార్గం అమర్‌కుమార్, చింతకింది వంశీ పేర్కొన్నారు. శుక్రవారం వారు అశోక్‌నగర్‌లో మాజీమంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయమైన సామాజిక న్యాయం బీసీలకు లభించేందుకు గాను తెలంగాణ బంద్‌లో బీసీలు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముషీరాబాద్‌లో ఉన్న పద్మశాలీలు అందరూ తమవంతుగా ఈ బంద్‌లో పాలుపంచుకోవాలన్నారు.

నిరుద్యోగ జేఏసీ..

రాష్ట్ర బంద్‌కు నిరుద్యోగ జేఏసీ మద్దతు ప్రకటించింది. శుక్రవారం చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో జేఏసీ అధ్యక్షుడు డి. సలీమ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సంపూర్ణంగా మద్దతు తెలిపి బీసీల రిజర్వేషన్లకు మద్దతు తెలపాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై స్టేకు నిరసనగా ఈ బంద్‌లో పాల్గొనాలని ఆయన వెనుకబడిన తరగతుల ప్రజలను కోరారు. నిరుద్యోగులు ఈ బంద్‌లో పాల్గొంటారని వివరించారు. రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదో షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టాలని కోరారు. వెంకటేష్, సంపత్, రవి తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట గౌడ సంఘం..

రాంనగర్ : స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల అమలుకోసం బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే రాష్ట్ర బంద్‌కు అంబర్‌పేట గౌడ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం అంబర్‌పేట సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గిరిధర్ గౌడ్, తొలుపునూరి కృష్ణగౌడ్, ఉపాధ్యక్షులు మల్లికార్జున్‌గౌడ్, శ్రీహరి, రమణగౌడ్ మాట్లాడుతూ బంద్‌లో అంబర్‌పేట గౌడ సంఘం సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేస్తామని తెలిపారు.

ముషీరాబాద్ పద్మశాలీ సంఘం..

బంద్‌కు ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలీ సంఘం సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు అతినగరం సుదేష్, సంఘం ఉపాధ్యక్షుడు నేత శ్రీనివాస్‌లు కోరారు. బంద్‌లో ముషీరాబాద్ నియోజకవర్గంలోని పద్మశాలీలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహేంద్ర మేదర సంఘం..

స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే రాష్ట్రబంద్‌కు జంటనగరాల మహేంద్ర మేదర సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్, ప్రధాన కార్యదర్శి పిల్లి గురుమూర్తి, కోశాధికారి కైలాష్, ఉపాధ్యక్షుడు రాంకుమార్ మాట్లాడుతూ బీసీ బంద్‌లో జంటనగరాలలోని మహేంద్ర మేదర కులస్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంబర్‌పేట గౌడ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గిరిధర్‌గౌడ్, తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు



మాట్లాడుతున్న జంటనగరాల మహేంద్ర మేదర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్ తదితరులు

హనుమంతరావు ఆధ్వర్యంలో అఖిలపక్ష ర్యాలీ

బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు మాజీ ఎంపీ వి హనుమంతరావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం అంబర్‌పేట మహంకాళి ఆలయం నుంచి నియోజకవర్గంలో అఖిలపక్ష ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ బాగ్అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీధర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో పాటు అన్ని పార్టీల నేతలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ ర్యాలీలో అఖిలపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బంద్‌లో విద్యార్థులందరూ పాల్గొనాలి : గుజ్జ సత్యం

రాంనగర్: తెలంగాణలో సామాజిక న్యాయం కోసం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేసే అవసరం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పేర్కొన్నారు. రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే రాష్ట్ర బంద్‌లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బంద్‌కు మద్దతుగా శుక్రవారం విద్యానగర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ విద్యానగర్, అడిక్‌మెట్, లక్కీ చౌరస్తా, శివం చౌరస్తా నుంచి బీసీ భవన్ వరకు సాగింది. ర్యాలీలో బీసీ సంఘాల నేతలు టి రాజ్‌కుమార్, రాజునేత, మణికంఠ, అనురాధరెడ్డి, శ్రీధర్, హరీష్, నిఖిల్, వంశీ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల డిమాండ్ న్యాయమైంది : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



రాంనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న శనివారం నిర్వహించతలపెట్టిన రాష్ట్ర బంద్‌కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బీసీ సంఘాల జేఏసీ విజ్ఞప్తి మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారని చెప్పారు. శుక్రవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ బంద్‌లో తాము స్వయంగా పాల్గొంటామని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలో బంద్ జయప్రదం చేయడానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరవుతున్నట్లు తెలిపారు. బంద్‌కు అంబర్‌పేట నియోజకవర్గంలోని వ్యాపారవాణిజ్య సంస్థలు, ప్రజలు, విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని ఎమ్మెల్యే వెంకటేష్ కోరారు. రాష్ట్రంలో 56శాతం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నది న్యాయమైన డిమాండ్ అని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ కూడా రిజర్వేషన్లకు అనుకూలంగా లేదన్న విషయం కోర్టులు ఇచ్చిన స్టేవల్ల స్పష్టమైందని చెప్పారు. రాష్ట్రంలోని బీసీలందరూ సంఘటితమై శనివారం జరిగే బంద్‌ను జయప్రదం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎన్నికల షెడ్యూల్డు వెలువడిన తర్వాత ఎన్నికలపై స్టే రావడం బీసీల నోటికాడి బుక్కను లాక్కున్నట్లు అయ్యిందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడం కోసం ఎమ్మెల్యేగా తనవంతు పోరాటం చేస్తానని ప్రకటించారు. జంటనగరాలలోని ప్రజలందరూ కూడా బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

వైన్ షాపు తొలగించాలని ధర్నా

అంబర్‌పేట : నివాస గృహాల సమీపంలో ఉన్న వైన్‌షాప్‌ను తొలగించాలని స్థానికులు ధర్నాకు దిగారు. అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తా సమీపంలోని వైన్ షాపు వద్ద శుక్రవారం రాత్రి దుర్గానగర్, అహ్మద్‌నగర్, అజాద్‌నగర్ వాసులు మెరుపు ధర్నాకు దిగారు. నిబంధనలకు విరుద్ధంగా నివాసాల మధ్య వైన్ షాపునకు అనుమతి ఇచ్చారని, వెంటనే పర్మిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దుకాణం వద్ద ఇష్టానికి మద్యం తాగుతోన్న కొందరు వ్యక్తులు ఉద్యోగాలు, ఇతర పనుల నిమిత్తం వెళ్లి రాత్రి వేళ ఇంటికి వస్తోన్న సమయంలో ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి వైన్‌షాప్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.



వైన్‌షాప్‌ను తొలగించాలని ధర్నా చేస్తున్న స్థానికులు



సెంట్రల్ జోన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న సెంట్రల్ జోన్ పీస్ కమిటీ సభ్యులు మహ్మద్ జహంగీర్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, సెంట్రల్ జోన్ పీస్ కమిటీ అధ్యక్షుడు శశికాంత్ అగర్వాల్‌లు అభినందన పత్రాన్ని అందజేశారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

వృద్ధ దంపతులపై దాడిచేసిన కేర్‌టేకర్ అరెస్ట్

● 6.7 తులాల బంగారు నగలు, సెల్‌ఫోన్ స్వాధీనం

● వివరాలు వెల్లడించిన డీసీపీ కె.శిల్పవల్లి

కవాడిగూడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్, జల్సాలకు అలవాటుపడిన ఓ కేర్‌టేకర్ అప్పులపాలై తాను పనిచేస్తున్న ఇంటి యజమానులపై దాడిచేసి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి తెలిపారు. దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 6లో వృద్ధ దంపతులపై కేర్‌టేకర్‌గా ఉన్న గోవర్ధన్ దాడిచేసి బంగారు నగలు అపహరించుకొని పారిపోయాడు. ఈ కేసును పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేసి అనుమానం ఉన్న కేర్‌టేకర్ గోవర్ధన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు డీసీపీ తెలిపారు. శుక్రవారం సెంట్రల్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శిల్పవల్లి, అడిషనల్ డీసీపీ ఆనంద్, గాంధీనగర్ ఏసీపీ యాదగిరి, దోమలగూడ సీఐ ఎండీ అంజద్‌అలీతో కలిసి వివరాలను విలేకరులకు వెల్లడించారు. దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 6లో ఉన్న హెరిటేజ్ అపార్ట్‌మెంట్‌లో ఈనెల 12న వృద్ధ దంపతులపై దాడిచేసి బంగారు నగలు అపహరించుకుపోయారని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించగా కేర్ టేకర్‌గా ఉన్న గోవర్ధన్ నిందితుడుగా గుర్తించి అతని వద్ద నుంచి సుమారు ఏడు తులాల బంగారు నగలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని గోవర్ధన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 6 హెరిటేజ్ అపార్ట్‌మెంటులో నివాసం ఉండే ఆనందరావు(86), అనసూయ(83) దంపతులు వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటుండగా కుమారుడు విదేశాల్లో ఉంటున్నారు. ఈ వృద్ధ దంపతుల ఆలనాపాలనా చూసేందుకు ఓ ఏజెన్సీ ద్వారా కృష్ణాజిల్లాలోని ఉయ్యూరు మండలం కంకిపాడు గ్రామానికి చెందిన గోవర్ధన్ ఎనిమిది నెలల క్రితం కేర్‌టేకర్‌గా పనిలో చేరాడు. అయితే ప్రతి రెండు రోజులకోసారి నగరంలో ఉండే ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు వారిని చూసి బాగోగులు తెలుసుకునేవారు. కాగా ఆన్‌లైన్ బెట్టింగ్, జల్సాలకు అలవాటుపడిన గోవర్ధన్ తన అప్పులు తీర్చుకునేందుకు వృద్ధదంపతుల ఒంటిపై ఉన్న బంగారు నగలు ఎలాగైనా కాజేయాలని పథకం పన్నాడు. ఈనెల 12న ఆనంద్‌రావు, అనసూయ కుటుంసభ్యుల ఇంట్లో శుభకార్యం ఉందని ఇంటికి వారిని చూడటానికి ఎవరూ రారని ముందుగా వేసుకున్న పథకం ప్రకారం అదే రోజు సాయంత్రం హెరిటేజ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఆ వృద్ధులపై రోకలిబండతో దాడిచేసి అనసూయ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, రెండు చేతులకు ఉన్న బంగారు గాజులు మొత్తం ఎనిమిది తులాల బంగారు నగలు తీసుకొని ఇంటి బయట గడియపెట్టి పారిపోయాడు. అయితే ఉదయం వరకు రక్తపు మడుగులో ఉన్న వృద్ధ దంపతులను ఎవరూ పట్టించుకోలేదు. వారికి రోజువారీగా వచ్చే పనిమనిసి ఉదయం వచ్చే సరికి ఇంటి బయటనుంచి గడియపెట్టి ఉందని అనుమానం వచ్చి ఆమె లోనికి వెళ్లి చూడగా వృద్ధ దంపతులు రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే డిడికాలనీలో ఉండే వృద్ధ దంపతుల అల్లుడు శ్రీధర్‌రావుకు సమాచారం అందించగా ఆయన వెంటనే ఇంటికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించి వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ వృద్ధ దంపతులపై దాడిచేసి బంగారు నగలు ఎత్తుకెళ్లారని అల్లుడు దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారని ఆమె వెల్లడించారు. వెంటనే కేసు నమోదు చేసుకొని రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. దాడి జరిగిన నాటినుంచి వృద్ధ దంపతులకు కేర్‌టేకర్‌గా ఉన్న గోవర్ధన్ కనిపించలేదు. దీంతో అతనిపై అనుమానం వచ్చి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కృష్ణా జిల్లాకు చెందిన నిందితుడు గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు డీసీపీ వెల్లడించారు. అతని వద్ద నుంచి 6.7 తులాల బంగారు నగలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో దోమలగూడ డీఐ సుధాకర్‌రావు, డీఎస్ఐ నిరంజన్, ఎస్ఐ శ్రీకాంత్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడు గోవర్ధన్‌ను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ కె శిల్పవల్లి, ఏసీపీ యాదగిరి, సీఐ ఎండీ అంజద్‌అలీ